# పుట్టినరోజు పండుగ

- దినవహి సత్యవతి

శ్రావ్య తాడివాడ లో ఆరోతరగతి చదువుతోంది. స్కూల్ లో అందరికంటే చాలా బాగా చదువుతుంది. స్కూల్ లో టీచర్లందరికి బాగా చదువుతున్న శ్రావ్య అంటే చాలా అభిమానం. దీనివల్ల మిగతా కొంతమంది తోటి విద్యార్ధులకు కొంచెం అసూయ. స్కూలు టీచర్లు పిల్లలందరికీ జంతు ప్రదర్శనశాల (జూ) చూపించడానికి ఆ రోజు తీసుకెళ్తున్నారు.

పిల్లలందరు బస్సు లో ఎంతో సరదాగా పాటలు పాడుతూ పరిసరాలు చూస్తూ వెళుతున్నారు. శ్రావ్య కూడా వారితోవుంది. మిగతా పిల్లలందరూ ఎవరికోసం వారు దారిలో తినడానికి చాక్లెట్లూ, పాప్ కార్న్, స్వీట్స్ తెచ్చుకున్నారు. ఎవరు తెచ్చుకున్నవి వాళ్ళే తింటున్నారు. కాసేపటికి వాళ్ళు తెచ్చుకున్నవన్నీ తినేశారు. విశాఖపట్నం ఇంకా చాలా దూరం వుంది. ప్రత్యేకమైన స్కూల్ బస్సు అవ్వడం వలన ఎక్కడా ఆగకుండా బస్సు ముందుకు పోతున్నది.

అప్పుడు శ్రావ్య తను తెచ్చుకున్న బ్యాగ్ లో నుండి జామ పళ్ళు తీసి అందరికి ఒక్కొక్కటి ఇచ్చింది. తన కోసమే కాకుండా అందరికోసం తెచ్చిన శ్రావ్యను అందరూ అభినందించారు. ఉదయం 10:30 కి స్కూల్ బస్సు జూకి చేరుకుంది. ఇద్దరు టీచర్లు టికెట్లు తెచ్చారు.

అందరూ క్యూలో నిలుచుని జూలోకి వెళ్ళారు. జూలో అన్ని జంతువులను పిల్లలందరూ ఆసక్తిగా సరదాగా చూసారు.

శ్రావ్య వారితో పాటు ఆసక్తిగా చూస్తూనే, తన చేతిలోని చిన్న నోట్ బుక్ లో ఆ జంతువులకు సంభందించిన అన్ని విషయాలను వ్రాసుకుంటూ వాళ్ళతోపాటే ముందుకు కదులుతోంది. జూ చూడడం అయ్యాక, జూ లో క్యురేటర్ గది దగ్గర సజెషన్ బుక్ వుంది. అందులో పిల్లలందరూ వెరీ గుడ్, వెరీ హ్యాపీ, వెరీ నైస్ అంటూ వ్రాసి సంతకాలు చేశారు. శ్రావ్య మాత్రం ఇక్కడున్న చాలా జంతువులు ఆహారలోపం వల్ల బక్కచిక్కి ఉన్నాయనీ, కొన్ని జంతువులు అనారోగ్యంగా కనిపిస్తున్నాయని, జూలో చెట్లు చాలా తక్కువగా వున్నాయని, వ్రాసి

www.sirimalle.com

సంతకం చేసింది. క్యూరేటర్ అభినందనగా శ్రావ్య వైపు చూశాడు. ప్రక్కన వున్నా టీచర్స్ తో ఇలా మంచి సజెషన్స్ ఇవ్వడం వలన మా పై అధికార్లు వీటిని చూసి తగిన చర్యలు తీసుకొని జూ ని మెరుగు పరుస్తారని చెప్పారు.

జూ లోనే క్యూరేటర్ గదికి ఎదురుగా వున్నా జూ నిర్వహిస్తున్న షోరూం లోకి పిల్లలంతా వెళ్ళారు. అక్కడున్న వస్తువులేవి పిల్లలను ఆకర్షించలేక పోయాయి. కాని శ్రావ్య కు మాత్రం ఆ షోరూంలో చాలా వస్తువులు ఆకర్షించాయి. వాళ్ళ తాతయ్య గారి కోసం చేతి కర్ర, చెప్పులు, స్కూల్ అటెండరు కోసం టీ షర్టు, నానమ్మ కోసం కళ్ళజోడు ఫ్రేమ్ తీసుకుంది. ఈ వస్తువులు అమ్మడం వల్ల వచ్చే లాభాన్ని ఆ జూలోని జంతువులకు ఆహారం, వైద్యం కోసం ఉపయోగిస్తారని తనకు ఇంట్లో తాతయ్య చెప్పారని అందుకే అవన్నీ అక్కడ కొన్నానని టీచర్ తొ చెప్పింది శ్రావ్య. అందరికి సహాయపడే గుణమున్న శ్రావ్యని అందరూ అభినందించారు. బస్ తిరుగు ప్రయాణమయింది.

(నాని సౌజన్యంతో)